క్లుప్తంగా

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏలూరు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో చేనేత రంగానికి న్యాయం చేయాలని, చేనేత కులానికి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద జిల్లాకు చెందిన ఆప్కో కార్యాలయాన్ని ఆప్కోకి అప్పగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్పందన కార్యక్రమంలో అందజేశారు. ఏపీ చేనేత కార్మికక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడుపు కన్నయ్య, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు తదితరులు మాట్లాడారు.

నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలి



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులు

ఏలూరు (టూటౌన్): గ్రీన్ ఫీల్డ్ భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులు కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణం చేసే సమయానికి సాగు చేస్తున్న చెరకు, పచ్చిమిర్చి, వరి, వర్జీనియా పొగాకు తదితర రైతులందరికీ పంటలకు నష్టపరిహారం అందించాలని కోరుతూ స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణికి వినతి పత్రం అందజేశారు. కొట్టు కనక నరసింహారావు, పుసులూరి శ్రీహరి, గూడపాటి శ్రీనివాసరావు, మంచాల సుబ్బారావు, మౌనికల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎండలు తగ్గాలని ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న అహలే సున్నతుల్ జమాత్ సంస్థ సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఎండలు తగ్గి వర్షాలు పడాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు స్థానిక అహలే సున్నతుల్ జమాత్ సంస్థ ఆధ్వర్యంలో మెయిన్ బజారులోని గొలుసుల పంజా వద్ద ముస్లింలు, హిందువులు చేశారు. అనంతరం పాదచారులకు బాదం పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జమాత్ అధ్యక్షుడు ఎస్కే సాబీర్ హుస్సేన్, ప్రచార కార్యదర్శి ఎండీ ఎక్బాల్, ఉప కార్యదర్శి ఎండీ గాలబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి సమీపంలోనే వైద్య సేవలు

- వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లీనిక్స్‌తో మేలు
- ఏలూరు నగరంలో రూ.5 కోట్లతో యూపీహెచ్‌సీలు
- తాజాగా రూ.1.71 కోట్లతో రెండు యూపీహెచ్‌సీల ప్రారంభం
- ఎమ్మెల్యే నాని ప్రత్యేక శ్రద్ధతో ఆరోగ్య సేవలు



కొత్తపేట 39వ డివిజన్‌లో నిర్మించిన యూపీహెచ్‌సీ భవనం



పవర్‌పేట 34వ డివిజన్‌లో నిర్మించిన యూపీహెచ్‌సీ నూతన భవనం

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో నాలుగంచెల వైద్య సేవలు, పట్టణ ప్రాంతాల్లో మూడంచెల వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేలా నూతన విధానాలకు నాంది పలికారు. ఏలూరు నగరంలో రూరల్ ప్రాంతాల్లో ఫ్యామిలీ డాక్టర్, వైఎస్సార్ యూపీహెచ్‌సీలు, జిల్లా సర్వజన ఆసుపత్రులు ద్వారా వైద్య సేవలు అందించేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏలూరు నియోజకవర్గం ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని విశేష కృషి చేస్తున్నారు. ఏలూరు జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరు కావటంతో పాటు భవన నిర్మాణ పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. మరోవైపు వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లీనిక్స్ సైతం ప్రజలకు అందుబాటులోకి తెస్తూ ఇంటి సమీపంలోనే వైద్యాన్ని చేరువ చేశారు.

ఏలూరు నగరంలో సుమారుగా రూ.5 కోట్లతో అర్బన్ పీహెచ్‌సీలను అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే నాని ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు. అర్బన్ పీహెచ్‌సీలు 10 అభివృద్ధి, నూతన భవనాల నిర్మాణానికి నిర్ణయించారు. ఇప్పటికే 5 అర్బన్ పీహెచ్‌సీలను అభివృద్ధి చేస్తుండగా, మరో 5 వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లీనిక్స్ నిర్మాణం చేపట్టారు. వీటిలో మూడు యూపీహెచ్‌సీలను ఇప్పటికే ప్రారంభించారు. గత నెలలో చాణక్యపురి కాలనీలో వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌ను ఎమ్మెల్యే నాని ప్రారంభించగా తాజాగా మూడు రోజుల క్రితం ఏలూరు కొత్తపేట సంతోష్‌నగర్‌లో 39వ డివిజన్‌లో జాతీయ హెల్త్ మిషన్, ఆయుష్మాన్ భారత్ నిధులు రూ.80 లక్షలతో యూపీహెచ్‌సీని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెడ్పీచైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, మేయర్ నూర్జహాన్‌తో కలిసి ప్రారంభించారు. పవర్‌పేటలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం వెనుక ప్రాంతంలో ఆయుష్మాన్‌భారత్ నిధులు, ఏలూరు నగరపాలక సంస్థ నిధులు రూ.91 లక్షలతో ఆధునిక సౌకర్యాలతో యూపీహెచ్‌సీ నూతన భవనాన్ని ప్రారంభించారు.



శోభాయమానంగా యూపీహెచ్‌సీ భవనాల లోపలి భాగం



యూపీహెచ్‌సీల్లో ఆధునిక సౌకర్యాలతో వాష్‌రూమ్స్

యూపీహెచ్‌సీలో సౌకర్యాలు ఇలా..

రాష్ట్ర సర్కారు ప్రతిష్టాత్మకంగా వైద్యరంగంపై పెద్దెత్తున నిధులను ఖర్చు చేస్తోంది. ప్రజలకు తమ ఇంటివద్దనే ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తోంది. ఒక్కో యూపీహెచ్‌సీని సుమారు రూ.80 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నారు. యూపీహెచ్‌సీ భవనంలో ఒక వెయిటింగ్ హాలు, ల్యాబరేటరీ, రెండు ఓపీ రూమ్స్, డ్రెస్సింగ్ రూమ్, లాబర్ రూమ్, మినీవార్డ్, మీటింగ్ హాల్, ఫార్మశీ గది, మైనర్ ఓటీ రూమ్, మూడు అన్ని సౌకర్యాలతో వాష్‌రూమ్స్ నిర్మించారు.

పేదలకు ఉచిత వైద్యం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం ప్రజలకు అత్యవసరమైన విద్య, వైద్యం ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా పేదలకు ఉచితంగా ఆధునిక వైద్యాన్ని చేరువ చేస్తున్నారు. ఏలూరు ఎమ్మెల్యే నాని ప్రత్యేక శ్రద్ధతో ఏలూరు నగరంలో 10 యూపీహెచ్‌సీలు అభివృద్ధి చేస్తున్నారు. గతంలో పేదలకు ఏదైనా అనారోగ్యం వస్తే ఆ కుటుంబాలు ఆర్థికంగా ఎంతో నలిగిపోయే పరిస్థితి ఉండేది. కానీ నేడు ఆలాంటి దుస్థితి లేకుండా వైద్యసేవలు చేరువ చేశారు.

– కిలాడి జ్యోతి, కార్పొరేటర్, 39వ డివిజన్, ఏలూరు

ఆధునిక వైద్యం పేదలకు చేరువ



ఏలూరు నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రీతిలో ఉచితంగా వైద్య సేవలు అందించాన్న లక్ష్యంతో ఎమ్మెల్యే నాని విశేష కృషి చేస్తున్నారు. ఇంటికి సమీపంలో పేదవర్గాలకు అందుబాటులోకి నేడు వైద్యశాల రావటం విశేషం. యూపీహెచ్‌సీల్లో మినివార్డు సైతం ఏర్పాటు చేస్తూ వైద్య సేవలు అందిస్తారు. 156 రకాల మందులు, వైద్య పరీక్షలు అందుబాటులో ఉంటాయి. వైద్యుడు, నర్సులు, ల్యాబ్ సిబ్బంది ప్రజలకు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉంటారు.

– యర్రంశెట్టి సుమన్, కార్పొరేటర్, 34వ డివిజన్, ఏలూరు

విద్యార్థుల ఉన్నతే సీఎం జగన్ లక్ష్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర మెడికల్ బోర్డు సభ్యుడు దిరిశాల వరప్రసాద్ తెలిపారు. స్థానిక సత్రంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు పాఠశాల స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దిరిశాల మాట్లాడుతూ విద్యార్థులంతా పోటీ పడి చదివి నగదు బహుమతులు గెలుచుకోవడానికి కృషి చేయాలని సూచించారు. పదో తరగతి పరీక్షల్లో పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఊసా చరణ్ నాగ కృష్ణతేజ్‌కు రూ.3 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన తూములూరి షణ్ముఖ జితేంద్రకు రూ.2 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన నారాయణం మాధవ సాయికి రూ.1000 నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు అన్నపనేని రవి కుమార్, ప్రధానోపాధ్యాయురాలు రెట్టా శైలజ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న అతిథులు

శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు

ఏలూరు టౌన్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని, ప్రజలకు మెరుగైన సేవలు అందించటమే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తోందని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. ఏలూరులోని డీఐజీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు దంపతులు ఏలూరు రేంజ్ డీఐజీని మర్యాదపూర్వకంగా కలిశారు. డీఐజీకి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ దంపతులను డీఐజీ సాదరంగా ఆహ్వానం పలికారు. ఉమ్మడి పశ్చిమలో ప్రజలకు శాంతిభద్రతల పరిరక్షణపై చర్చించారు. ప్రజలకు ఫ్రెండ్లీ పోలీసింగ్ చేస్తున్నామని డీఐజీ వివరించారు. జిల్లాలో అనేక సంక్లిష్టమైన కేసులను సత్వరమే పరిష్కరించటం పట్ల జెడ్పీ చైర్‌పర్సన్ సంతోషం వ్యక్తం చేశారు. పోలీస్ శాఖకు తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. జిల్లా పరిషత్ చేపట్టే అనేక సంక్షేమ కార్యక్రమాల్లో పోలీసులను భాగస్వాములను చేస్తామని చెప్పారు. అనంతరం తేనీటి విందును స్వీకరించారు.



డీఐజీ అశోక్‌కుమార్‌ను కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రసాదరావు దంపతులు

డీఈఓను కలిసిన యూటీఎఫ్ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యూటీఎఫ్ ఏలూరు జిల్లా మధ్యంతర కౌన్సిల్లో ఎన్నికయిన నాయకత్వం జిల్లా విద్యాశాఖాధికారిని తన కార్యాలయంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతభత్యాలు ఈ నెలలో చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని, బదిలీల్లో టెక్నికల్ అభ్యంతరాల వల్ల మారుమూల ప్రాంతాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులకు దగ్గర మండలాల్లో నియమించడానికి కమిషనర్ అనుమతి తీసుకోవాలని కోరారు. పనిచేసే మండలాల నుంచి 150 నుంచి 200 కిలోమీటర్ల వరకు దూరం బదిలీ అయిన ఉపాధ్యాయుల కుటుంబ పరిస్థితులు, వృద్ధాప్య తల్లిదండ్రులు, చిన్నపిల్లలు ఉన్నవారిని దగ్గర ప్రాంతాలకు డిప్యూటేషన్‌పై నియమించాలని, ఇంగ్లిష్ ప్రమోషన్ ఉత్తర్వులు పొంది ఖాళీలు లేని కారణంగా ఎస్జీటీగా ఉండిపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేసి ప్రమోషన్ కల్పించాలని, 1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులకు ప్లేసులు ఇచ్చి న్యాయం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్కే ముస్తఫా అలీ, ఆర్ రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, జిల్లా ఉపాధ్యక్షురాలు వి.కనకదుర్గ, జిల్లా కోశాధికారి జీవీ రంగ మోహన్, జిల్లా కార్యదర్శులు ఎస్ సుధారాణి, ఇ.శివశంకర్, కె.కమల్ కుమార్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ బి.మోహన్‌రావు పాల్గొన్నారు.

సొసైటీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో కో ఆపరేటివ్ సొసైటీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏపీ స్టేట్ అగ్రికల్చర్ కో ఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తోట వెంకట్రామయ్య కోరారు. సోమవారం స్థానిక జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ వద్ద ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సొసైటీ ఉద్యోగులు నిర్వహించిన మహా ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. పీఏసీఎస్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఏసీఎస్‌లలో రైతు భరోసా కేంద్రాలను విలీనం చేయవద్దని, పీఏసీఎస్‌లలో 50 శాతం వాటాను ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చే ఆలోచన ఉపసంహరించుకోవాలని, వేతన సవరణ వెంటనే చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎస్‌వీడీ ప్రసాద్, ఏలూరు జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు పీ. విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టురోగులను గుర్తించాలి

పెదపాడు: స్థానిక పీహెచ్‌సీ పరిధిలో కుష్టు రోగులను గుర్తించాలని డాక్టరు చక్రధర్ వైద్యసిబ్బందిని ఆదేశించారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పీహెచ్‌సీ పరిధిలోని ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ఎంఎల్‌హెచ్‌పీ (సీహెచ్‌ఓ)లతో సమావేశమయ్యారు. ప్రతి ఇంటికీ వెళ్లి కుష్టు రోగులను గుర్తించి సమాచారాన్ని అందించాలన్నారు. డాక్టర్ అనంతపాల్ హెల్త్‌సూపర్‌వైజర్లు పార్వతీశం, రవీంద్ర, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మోదీ పాలనపై రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం

జీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

ఏలూరు (టూటౌన్): ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనపై రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తున్నట్టు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు తెలిపారు. ఏలూరులో నిర్వహించిన పార్టీ సభలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ పాలనపై 13 రకాల కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రంలోని 25 జిల్లాల్లో 25 బహిరంగ సభలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని 90 లక్షల మంది పేదలకు ప్రధాని బియ్యం అందిస్తున్నారని చెప్పారు. 60 లక్షల మంది రైతుల ఖాతాల్లో నగదు జమ చేశారన్నారు. ఉపాధి హామీ పథకంలో ఐదేళ్లలో ఒక్కొక్కరికి రూ.2.50 లక్షలు అందించిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని తెలిపారు. పోలవరానికి నిధులిచ్చారని చెప్పారు. కొద్దిరోజుల్లో బీజేపీ నేతలు ప్రతి గడపకూ వచ్చి తొమ్మిదేళ్ల పాలన గురించి ప్రజలకు వివరించనున్నట్టు చెప్పారు. సభలో మాజీ ఎంపీ సుజనా చౌదరి, మాజీ ఎమ్మెల్యేలు అంబికా కృష్ణ, చిన్నం రామకోటయ్య, నేతలు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, కొర్లల సుధాకర్ కృష్ణ, గాది రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీర్రాజు

సెల్‌ఫోన్ తాకట్టు విషయంలో వివాదం

అర్ధరాత్రి ఎత్తుకెళ్లి వ్యక్తిని చావగొట్టిన గ్యాంగ్

ఏలూరు టౌన్: తాపీ కార్మికుడికి, సెల్‌ఫోన్లు తాకట్టుపెట్టుకునే యువతికి మధ్య చెలరేగింది. ఇది తాపీ కార్మికుడిపై దాడికి దారితీసింది. ఇంటిలో పడుకున్న కార్మికుడిని నిర్మానుష్య ప్రాంతానికి లాక్కెళ్లి మరీ చావబాదారు. ఈలోగా అతని భార్య ఏలూరు టూటౌన్ పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగి గంట వ్యవధిలోనే అతడ్ని విడిపించి, గ్యాంగ్‌పై కిడ్నాప్ కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఏలూరు తంగెళ్లమూడి చాకలిపేటకు చెందిన క్షత్రి దుర్గాప్రసాద్ (35) తాపీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తంగెళ్లమూడి యాదవనగర్‌కు చెందిన భట్టు వనజ (25) అలియాస్ అక్షయ అనే యువతి సెల్‌ఫోన్లు తాకట్టుపెట్టుకుని డబ్బులు ఇస్తుంటుంది. గతంలో అనేకమార్లు దుర్గాప్రసాద్ తన ఫోన్, స్నేహితుల ఫోన్లు ఆమె వద్ద తాకట్టు పెట్టి విడిపించుకునేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం తన స్నేహితుడి ఫోన్ తాకట్టు పెడతానంటూ అక్షయకు ఫోన్ చేశాడు. తాకట్టు పెట్టుకునేందుకు ఆమె నిరాకరించింది. వీరిద్దరి మధ్య సంభాషణతో వివాదం రేగింది. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో వనజ కూడి రోహిత్, నగిరెడ్డి ఏసు, స్వామి అనే ముగ్గురు యువకులను దుర్గారావు వద్దకు పంపింది. వారు నిద్రపోతున్న దుర్గాప్రసాద్‌ను ఇంట్లో నుంచి లేపి కొట్టుకుంటూ మోటారు సైకిల్‌పై సోమవరప్పాడు రోడ్డులోని నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లారు. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న వనజ మరికొందరు యువకులు కలిసి దుర్గాప్రసాద్‌ను చావబాదారు. ఈలోగా దుర్గాప్రసాద్ భార్య టూటౌన్ పోలీసులకు ఫోన్ చేశారు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాలతో డీఎస్పీ ఈ.శ్రీనివాసులు పర్యవేక్షణలో టూటౌన్ సీఐ చంద్రశేఖర్, ఎస్సై ప్రసాద్ తమ సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. ఒక గంట వ్యవధిలోనే ఘటనా స్థలానికి చేరుకుని 10 మందిని అదుపులోకి తీసుకుని కిడ్నాప్ కేసు నమోదు చేశారు. కూడి రోహిత్, స్వామి పరారయ్యారు. పోలీసుల అదుపులో ఉన్నవారిలో ముగ్గురు మైనర్లు. అరెస్టయిన వారిలో తంగెళ్లమూడి యాదవనగర్‌కు చెందిన గాడి ఏసు (19), కబడ్డీ గూడేనికి చెందిన మడుగు నాగసత్యసాయితేజ అలియాస్ చింటు (21), తంగెళ్లమూడి శివగోపాలపురానికి చెందిన పిల్లల రాజు (21), యాదవనగర్‌కు చెందిన గూడపాటి నాగప్రవీణ్ అలియాస్ బాబి (19), శ్రీకాకుళపు సాయిభగవాన్ గణేష్ (19), భట్టు వనజ అలియాస్ అక్షయ, పట్నాల నవీన్ (20) ఉన్నారు. నిందితులను పోలీసులు సోమవారం న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. పరారీలో ఉన్న ఇద్దరి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

డీఈఎల్ ఈడీ పరీక్షలు ప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డీఈఎల్ఈడీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 2వ సెమిస్టర్ పరీక్షలకు మొత్తం 149 మంది అభ్యర్థులూ హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవి సాగర్ తెలిపారు. మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలకు 75 మందికి 22 మంది హాజరు కాగా, 53 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు.

సీపీఎం పోరుయాత్రకు మద్దతు

ఏలూరు(టూటౌన్): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి సీపీఎం చేపట్టిన పోలవరం నిర్వాసితుల పోరుకేక మహా పాదయాత్రకు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ పోరుయాత్రకు సంఘీభావంగా సోమవారం స్థానిక పవరు పేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన నిర్వహించారు. పాదయాత్ర నెల్లిపాక నుంచి విజయవాడ వరకు జూన్ 20 నుంచి జూలై 4 వరకు వందలాది మందితో నిత్యం సాగుతుందని రవి తెలిపారు. ఉప్పులూరి హేమ శంకర్ (సీపీఐ), ఎస్.కాశీ నరేష్ (జనసేన), షేక్ మస్తాన్ వలి (ఆప్), బండి వెంకటేశ్వరరావు (వ్యవసాయ కార్మిక సంఘం), బి.సోమయ్య (సీఐటీయూ), కె.లెనిన్ (ఎస్ఎఫ్ఐ)లు మాట్లాడుతూ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని కోరారు. టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు మద్దతు తెలిపాయి. సీపీఎం నగర కార్యదర్శి పి.కిషోర్ పాల్గొన్నారు.

బాలలతో పని చేయించటం నేరం

పెదవేగి : బడి బయట ఉన్న బాలలను గుర్తించి బడికి పంపించేలా చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శి పి విజయరాజేష్ అన్నారు. పెదవేగి మండలం, అమ్మపాలెంలోని ఎంపీయూపీ స్కూల్ వద్ద చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాప్ ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా గ్రామ కార్యదర్శి పి. విజయ రాజేష్ అధ్యక్షతన గోడ పత్రికను ఆవిష్కరించారు. గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్ వద్ద చైల్డ్ రైట్స్ అడ్వకసీ ముద్రించిన గోడ పత్రికను గ్రామ కార్యదర్శి ఆవిష్కరించారు. గోడ పత్రికను బడి, అంగన్‌వాడీ సెంటర్, సచివాలయం వద్ద గోడలకు అంటించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ ఎం. కావ్య, స్కూల్ హెచ్ ఎం టీ.సుజాత, క్రాప్ కో ఆర్డినేటర్ ఎస్ రవి బాబు, అంగన్‌వాడీ టీచర్స్ రంగమ్మ, క్రాప్ సిబ్బంది సౌజన్య టీచర్స్, పంచాయతీ బాలలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

దెందులూరు: పొలంలో విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి దెందులూరు ఎస్సై ఐ.వీర్రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవరప్పాడు గ్రామానికి చెందిన నెక్కంటి అచ్యుతరామయ్య పొలంలో బోరు రిపేరు నిమిత్తం పెదవేగి మండలం వంగూరుకి చెందిన వర్రే నాగరాజు (36)ను తీసుకువచ్చారు. ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు నాగరాజు విద్యుదాఘాతానికి గురవడంతో హుటాహుటిన అతడ్ని ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఆదివారం రాత్రి చికిత్స పొందుతూ నాగరాజు మృతి చెందాడని ఎస్సై వివరించారు. నాగరాజుకు భార్య, ఏడాదిన్నర కుమార్తె ఉంది.